ప్రజలకు జవాబుదారీగా ఉంటాం..

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



రామకృష్ణానగర్‌లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు

విజయనగరం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా ప్రజలకు జవాబుదారీగా ఉంటామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 19వ డివిజన్ లంకాపట్నం అంబేడ్కర్ బొమ్మ నుంచి సోమవారం ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. స్థానిక సమస్యలపై ఆరాతీస్తూ వెంటనే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా 29వ డివిజన్ పోర్ట్ సిటీ స్కూల్ నుంచి ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు కోలగట్ల కృష్ణారావు, జి.ఈశ్వర్ కౌశిక్ పాల్గొన్నారు. రామకృష్ణనగర్, తదితర ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులు పొందిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల కృష్ణారావు మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాలు, అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరించవచ్చన్నారు. రామకృష్ణనగర్‌లో గతంలో ప్రజలు అనేక అవస్థలు ఎదుర్కొనే వారని.. కోలగట్ల వీరభద్రస్వామి శాసనసభ్యుడిగా ఎన్నికైన తర్వాత ఎన్నో సమస్యలు పరిష్కరించారన్నారు. ఆ ప్రాంతంలో నాలుగు బోర్లు, వీధిదీపాలు ఏర్పాటు చేయడంతో పాటు స్థానికులకు పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయించారన్నారు. పార్టీ నాయకుడు ఈశ్వర్ కౌశిక్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా ప్రజల ఖాతాలకు వెళ్లడంతో పారదర్శక పాలన అందుతోందన్నారు. కార్యక్రమాల్లో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్లు పొట్నూరు శ్రీనివాసరావు, మీసాల రమాదేవి, కోఆప్షన్ సభ్యురాలు పిల్లా పద్మావతి, మాజీ వైస్ చైర్‌పర్సన్ లంక వరలక్ష్మి, పొట్నూరు పద్మ, దేశెట్టి మోహన్, లంక నరేష్, కృష్ణారెడ్డి, గుణ పాల్గొన్నారు.

38వ డివిజన్‌లో...

నగరంలోని 38వ డివిజన్ బొబ్బాదిపేట శివాలయం నుంచి జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు. స్థానిక కార్పొరేటర్ తొగురోతు సంధ్యారాణి, నారాయణప్పడు, తదితరులు మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరింత బలపరచాలని కోరారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మరో అవకాశం ఇవ్వాలని కోరారు.

ఆర్టీసీ కాలనీలో చోరీ

విజయనగరం క్రైమ్: ఆర్టీసీ కాలనీలో దొంగలు పడ్డారు. వన్‌టౌన్ పోలీసులు సోమవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్న వ్యవసాయశాఖ అధికారి శ్యామ్ తమ బంధువుల గృహప్రవేశం నిమిత్తం శనివారం ఉదయం పాలకొల్లు వెళ్లారు. సోమవారం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న ఏడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై మురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమరవీరులను స్మరించుకోవాలి

• స్టేట్ రూరల్ డవలప్‌మెంట్ జాయింట్ కమిషనర్ అశోక్‌కుమార్

పూసపాటిరేగ: దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణాలు త్యాగం చేసిన అమరవీరులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని స్టేట్ రూరల్ డవలప్‌మెంట్ జాయింట్ కమిషనర్ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆజాదీ కా అమృత్ మహోత్సవం వేడుకల్లో భాగంగా నా భూమి - నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం పేరిట ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ, దేశ భవిష్యత్ కోసం యువత లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి. రామారావు, ఏపీఓ బి. రత్నమాల, టెక్నికల్ అసిస్టెంట్లతో పాటు సచివాలయం సిబ్బంది, వలంటీర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టర్ శ్రీలక్ష్మికి సత్కారం



శ్రీలక్ష్మిని అభినందిస్తున్న చాన్స్‌లర్, వీసీ

నెల్లిమర్ల రూరల్: ఇటీవల జరిగిన కామన్‌వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో రజత పతకం సాధించిన బీబీఏ విద్యార్థిని చుక్కా శ్రీలక్ష్మిని సెంచూరియన్ విశ్వ విద్యాలయం చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు ఘనంగా సత్కరించారు. టెక్కలి వర్సిటీలో సోమవారం ఏర్పాటు చేసిన సత్కార సభలో ఆయన మాట్లాడుతూ, యూనివర్సిటీలో చదువుతున్న శ్రీలక్ష్మి అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపించడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ఆమెకు రూ.15 వేల ప్రోత్సాహక బహుమతి అందజేశారు. అనంతరం సీనియర్ క్రీడాకారిణి మత్స సంతోషి, కోచ్ రవిలను కూడా అభినందించారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత లేని కోడిగుడ్లు సరఫరా చేస్తే చర్యలు

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు నాణ్యత లేని కోడిగుడ్లు సరఫరా చేస్తే చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు కోడిగుడ్లు సరఫరా చేసే గోదాంను పట్టణంలో సోమవారం ఆయన పరిశీలించి గుడ్ల నాణ్యత, బరువును తనిఖీ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల్లోనూ అభివృద్ధి

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
• ధర్మపురిలో రూ.8.65 లక్షలతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల

విజయనగరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో గతంలో ఎన్నడూలేని విధంగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలో అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 30వ డివిజన్ కొత్త ధర్మపురిలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో లో ఓల్టేజ్ సమస్య ఉందన్న విషయాన్ని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించినప్పుడు కోలగట్ల తెలుసుకున్నారు. వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడి రూ. 8.65 లక్షలతో 160 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పతివాడ గణపతిరావు, జోనల్ ఇన్‌చార్జ్ బొద్దాన అప్పారావు మాట్లాడుతూ, కొత్త ధర్మపురిలో ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న లో ఓల్టేజ్ సమస్యకు నేటితో పరిష్కారం లభించిందన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోలగట్లకు మరోసారి అవకాశం కల్పిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, మున్సిపల్, విద్యుత్ శాఖ సిబ్బంది, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న సైన్యానికి బీమా

• జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

డెంకాడ: జగనన్న సైన్యంలో భాగంగా పని చేస్తున్న జిల్లా, మండల జేసీఎస్ కన్వీనర్లతో పాటు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు బీమా సౌకర్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కల్పిస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెదతాడివాడలో ఉన్న పీబీఆర్ కల్యాణ మంటపంలో నెల్లిమర్ల నియోజకవర్గ స్థాయిలో జేసీఎస్ నమోదు శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, జేసీఎస్ మండల, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు జగనన్న సైన్యం యాప్‌లో నమోదు కావాలన్నారు. వీరందరికీ ఆరోగ్య, ఇతర సౌకర్యాలతో కూడిన బీమా సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 17వ వరకు అన్ని నియోజకవర్గాల్లో జేసీ నమోదు సమావేశాలు నిర్వహిస్తామన్నారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబునాయుడు విజయనగరం జిల్లాకు ఏమీ చేయలేదని.. అందుకే జిల్లాకు వచ్చినప్పుడల్లా లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. జనసేన అధినేత ఏమి చేస్తారో చెప్పకుండా వ్యక్తిగత ఆరోపణలు చేయడం తగదన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాల, గిరిజన యూనివర్సిటీ, భోగాపురం ఎయిర్‌పోర్ట్‌తో పలు పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేశారన్నారు. పొదుపు సంఘాల మహిళలకు గతంలో సున్నావడ్డీ మాఫీ కింద జిల్లాకు రూ.30 కోట్లు వస్తే.. ఈ ఏడాది రూ.61 కోట్లు మంజూరైనట్లు చెప్పారు.

పేదలకు ఎంతో మేలు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది మంది పేదలకు మేలు జరిగిందని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. జగనన్న కాలనీ ద్వారా ఇళ్లు లేని పేదలకు ఇళ్లు నిర్మిస్తున్నారని వివరించారు. నాడు- నేడు ద్వారా పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దాదరని తెలిపారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ, తాను పార్టీ మారుతాననే వస్తున్న ఊహాగానాలు నిజం కాదన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా గెలుస్తానని దీమా వ్యక్తం చేశారు. నెల్లిమర్ల నియోజకవర్గ సమన్వయకర్త అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జెడ్పీటీసీ సభ్యులు బడుకొండ లక్ష్మి, గదల సన్యాసినాయుడు, నెల్లిమర్ల, భోగాపురం, పూసపాటిరేగ మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు చనుమల్లు వెంకటరమణ, ఉప్పాడ సూర్యనారాయణ, అప్పలనాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్లు మహంతి శ్రీనివాసరావు, బైరెడ్డి అప్పలనారాయణ, పడాల భానుప్రకాష్, మండలాలకు చెందిన వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.